జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట

ఆదివారం, సెప్టెంబర్ 27, 2026 పేజీలు:12

## ఈ నెల 29న,ఉచిత కంటి చికిత్స శిబిరం

- జిల్లా ఆప్తాలమిక్ అధికారి కొత్ర బాలాజీ



**నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి)**

జిల్లా వైద్యఆరోగ్య శాఖ మరియు జిల్లా అందత్వ నియంత్రణ సంస్థ వారి ఆధ్వర్యంలో ఈనెల 29న, (మంగళవారం) ఉదయం 09:00 నుండి 11:00గంటల వరకు ఉచిత కంటి చికిత్స శిబిరము నిర్వహిస్తున్నట్లు నాగర్ కర్నూలు ఆప్తాలమిక్ అధికారి కొత్ర బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్ కర్నూల్ పట్టణంలోని పాత కలెక్టరేట్ భవనం లోని గదినెంబర్ 102 లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. శిబిరంలో రోగులకు ప్రత్యేక కంటి పరీక్షలు,సాధారణ పరీక్షలు నిర్వహించి,అందులో అవసరమైన వారికి,క్యాటరాక్టు పొర గలవారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు మహబూబ్ నగర్ లయన్ రామ్ రెడ్డి కంటి ఆసుపత్రిలో నిర్వహించ నున్నట్లు తెలిపారు.రోగులు ముందుగా బి.పి,షుగర్ పరీక్షలు చేసుకొని రిపోర్టు వెంట తెచ్చుకోవాలని,ఈ ప్రాంత రోగులు ఆధార్,రేషన్,ఓటర్ కార్డుఏదేని గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీ,ఫోన్ నెంబర్ ని తమవెంట తెచ్చు కోవాలని తెలిపారు.వివరాలకు 9440876556, 7386940480 లో సంప్రదించాలన్నారు.

# గ్రామీణ ప్రజలకు న్యాయ సేవలను చేరువ చేయడమే లక్ష్యం

**- అయ్యవారిపల్లిలో నెల రోజుల పాటు ఇంటింటి సర్వేలు.. ఉచిత న్యాయ అవగాహన, వైద్య శిబిరం : జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. ప్రేమలత**

**కోయిలకొండ, సెప్టెంబర్ 26 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు న్యాయ సేవలను చేరువ చేయడమే లక్ష్యంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. ప్రేమలత తెలిపారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు శనివారం కోయిలకొండ మండలం అయ్యవారిపల్లి గ్రామంలో న్యాయ అవగాహన సదస్సుతో పాటు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, సర్వోన్నత న్యాయస్థానం సూచనల మేరకు అయ్యవారిపల్లి గ్రామాన్ని ప్రత్యేక కార్యక్రమం కింద ఎంపిక చేసి ప్రజలకు న్యాయ సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చట్టబద్ధంగా అందేలా నెల రోజుల పాటు ఇంటింటి సర్వేలు నిర్వహించి, నివేదికలు రూపొందించి సంబంధిత ప్రభుత్వ శాఖలకు ప్రతిపాదనలు పంపనున్నట్లు వెల్లడించారు. గ్రామంలో పేదరిక నిర్మూలనకు అవసరమైన చర్యలను చట్టపరంగా చేపట్టేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కృషి చేస్తోందని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు తమ సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని, చిన్నచిన్న వివాదాలను పెద్దవి చేసుకుని కేసుల్లో చిక్కుకోవద్దని సూచించారు. ఏవైనా సమస్యలు ఎదురైతే న్యాయ సేవాధికార సంస్థ ద్వారా రాజీ మార్గంలో పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు న్యాయం సక్రమంగా అందడం లేదని పలు నివేదికలు సూచిస్తున్నాయని పేర్కొంటూ, న్యాయ సేవా స్వచ్ఛంద కార్యకర్తలు ప్రజల సమస్యలను గుర్తించి, ఇరుపక్షాల వాదనలు తెలుసుకుని, పరిష్కరించదగిన వివాదాలను ప్రాథమిక దశలోనే సామరస్యంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. సామాన్యులకు న్యాయాన్ని చేరువ చేయాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు.




**ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన:**

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డి. ఇందిర మాట్లాడుతూ, హైదరాబాద్‌లోని ఎం.ఎన్.జే క్యాన్సర్ ఆసుపత్రి, జిల్లా జనరల్ ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వైద్య పరీక్షలు, చికిత్సలు పొందాలని కోరారు. శిబిరంలో ఎం.ఎన్.జే క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు గ్రామస్తులకు ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. జిల్లా జనరల్ ఆసుపత్రి వైద్యులు వివిధ రకాల వైద్య పరీక్షలు, చికిత్సలు అందించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. ప్రేమలత వైద్యులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డులు (యూడీఐడీ), కార్మిక కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి, కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి పి. ఆంజనేయులు, నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి మొహమ్మద్ అఫ్రోజ్ అక్తర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డి. ఇందిర, ఎం.ఎన్.జే క్యాన్సర్ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ కీర్తన, జిల్లా సంక్షేమ అధికారి జరీన బేగం, ఎంపీడీవో ధనుంజయ గౌడ్, గ్రామ సర్పంచ్ వాగ్య రాము నాయక్, చైల్డ్‌లైన్ ప్రతినిధి చంద్రశేఖర్, న్యాయ సేవా స్వచ్ఛంద కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వెనుకబడిన విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించాలి

## -విద్యార్థుల అభ్యసన స్థాయి పెంపుకు ప్రణాళికలు రూపొందించాలి

## -జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి)**



నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల విద్యా సామర్థ్యాల మెరుగుపరిచే లక్ష్యంతో మండల విద్యాధికారులు స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తమ పరి ధిలోని పాఠశాలల వారీగా ప్రత్యేక కార్యాచరణను రూపొందించి సమర్థవంతంగా అమలు చేయాలని ముఖ్యంగా సబ్జెక్టుల్లో చదువులో వెనుకబడి సీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి,వారి అభ్యసన స్థాయిని మెరుగు పరిచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు ఒక విద్యార్థిని దత్తత తీసుకుని ప్రత్యేక శ్రద్ధతో బోధన అందించాలని జిల్లా కలెక్టర్ విద్యాధికారులకు సూచించారు.శనివారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ హాల్లో మండల విద్యాధికారులు,స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు,కేజీబీవీ ప్రత్యేక అధికారులతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యా సామర్థ్యాల పెంపుపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ డీఈఓ రమేష్ కుమార్‌తో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు పాఠశాల స్థాయి నుంచి పకడ్బందీగా చర్యలు చేపట్టాలని,అన్ని తరగతిగదుల్లో సబ్జెక్టులవారీగా విద్యార్థుల స్థాయిని గుర్తించి,వారి అవసరాలకనుగుణంగా బోధనా పద్ధతులను రూపొందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, ప్రతి ప్రభుత్వ పాఠశాలలో సీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులను గుర్తించి వారి పూర్తి వివరాలతో కూడిన జాబితాను సిద్ధం చేసి ఈ జాబితాను మండల విద్యాధికారులు,స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల వద్ద అందుబాటులో ఉంచాలని, సి గ్రేడ్ విద్యార్థులను సబ్జెక్టుఉపాధ్యాయుడు ఆయా సబ్జెక్టుల వెనుకబడిన విద్యార్థులను విధిగా దత్తత తీసుకుని,వారికి సబ్జెక్టుల వారీగా ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, అర్థమయ్యే రీతిలో ప్రత్యేక బోధన అందించాలని, ఆయా విద్యార్థుల ప్రగతిని క్రమం తప్పకుండా పరిశీలిస్తూ,వారి అభసన స్థాయిలో వచ్చిన మార్పులను నమోదు చేయాలని, విద్యార్థులు చదువులో వెనుకబడిన కారణాలను గుర్తించి,వారికి అవసరమైన అదనపు బోధన,పునశ్చరణ తరగతులు,వ్యక్తిగత శ్రద్ధ వంటి చర్యలను చేపట్టి విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని చదువు వెనుకబడిన విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిరుత్సాహపరచకూడదని ప్రతి విద్యార్థి తన సామర్థ్యానికి అనుగుణంగా అభివృద్ధి చెందేలా ఉపాధ్యాయులు ప్రోత్సాహకరమైన వాతావరణాన్ని కల్పించాలని,విద్యార్థులకు అర్థమయ్యే సరళమైన బోధనా పద్ధతులను అనుసరించి,సబ్జెక్టులవారీగా వారి సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని,విద్యార్థి ఏ అంశంలో వెనుకబడి ఉన్నాడో గుర్తించి, అదే అంశంపై అదనపు శ్రద్ధ పెట్టి అభ్యసన స్థాయిని మెరుగుపరచాలని సూచించారు.మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు తమ పరిధిలోని ప్రభు త్వ పాఠశాలలను క్రమంతప్పకుండా సందర్శించి పాఠశాలల్లో బోధన జరుగుతున్న తీరును పరిశీలించడంతోపాటు,విద్యార్థుల అభ్యసన స్థాయిని స్వయంగా అంచనావేయాలని విద్యార్థుల విద్యా సామర్థ్యాలపెంపునకు సంబంధించి ఉపాధ్యయులు చేపడుతున్న చర్యలను పరిశీలించి అవసరమైన మార్గదర్శకాలు,సూచనలు అందించాలని,ప్రతి పాఠశాలలో విద్యార్థుల విద్యా సామర్థ్యాల ఆధారంగా పాఠశాలల వారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని,కేవలం పరీక్షల సమయంలోనే విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేయకుండా నిరంతర అభ్యసన ప్రగతిని పరిశీలించాలని,విద్యార్థులలో చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం,గణిత నైపుణ్యాలు,సబ్జెక్టులపై అవగాహన వంటి ప్రాథమిక విద్యా సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని,ప్రతి విద్యార్థి కనీస విద్యా ప్రమాణాలను సాధించేలా ఉపాధ్యాయులు బాధ్యతతో పనిచేయా లని సూచించారు.ప్రతి పాఠశాలలో సీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేకంగా చేపట్టిన చర్యలు,వారి విద్యా సామర్థ్యాల్లో వచ్చిన పురోగతిని తదుపరి సమీక్ష సమావేశంనాటికి స్పష్టంగా చూపించాలన్నారు.ఈ సమావేశంలో డీ.ఈ.ఓ రమేష్ కుమార్,జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి కిరణ్ కుమార్, సెక్టోరియల్ అధికారి నూరుద్దీన్,వెంకటేశ్వర్ శెట్టి, మండల విద్యాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపా ధ్యాయులు,కే.జీ.బీ.వీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కేటి దొడ్డి మండలం లో పోస్టర్ ఆవిష్కరణ

**ఆలంపూర్ సెప్టెంబర్ 26(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**




సెప్టెంబర్ 28,29,30 తేదీలలో ఖమ్మం పట్టణంలో జరిగే ఏఐకే.ఎంఎస్ జాతీయ 4వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమం ఐ. ఎఫ్ .టి .యు జిల్లా అధ్యక్షులు జమ్మిచేడు కార్తీక్ మట్లాడుతూ దేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై రైతులు కూలీలు ఏకమై పోరాడాలని వారు పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు రైతులకు 12000 ఇస్తామని,వ్యవసాయ రంగాన్ని రక్షిస్తామని ప్రగల్బాలు పలికిన ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు వ్యవసాయాన్ని దారాదత్తం చేస్తూ నూతన వ్యవసాయ రంగ చట్టాలతో పల్లెలో నివసించే రైతులను దివాలా తీపిస్తున్నారని అన్నారు. నూతన యాప్ లను తీసుకొచ్చి ఏజెన్సీ ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం వల్ల సరైన సమయానికి ఎరువులు అందకపోవడంతో రైతుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన చెందారు. స్వామినాథన్ కమిషన్ సూచనల ప్రకారం పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలని, విద్యుత్తు సవరణ బిల్లు, విత్తన చట్ట బిల్లు, నూతన అటవీ హక్కుల నియమాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలు రూపొందించుటకు జరుగుతున్న ఈ మహాసభలను రైతులు కూలీలు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సింలు వీరన్న రంగస్వామి తాయప్ప మారిన కర్రన్న నర్సింలు ఎల్లప్ప మాదన్న రవికుమార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

# వయోవృద్ధుల గౌరవం, సమాజం బాధ్యత

## జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు

గద్వాల సెప్టెంబర్ 26(ప్రజా జ్యోతి ప్రతినిధి):

అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం2026 సందర్భంగా నిర్వహిస్తున్న వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో వయోవృద్ధుల హక్కులు,రక్షణ,సంక్షేమానికి సంబంధించిన సమాచార సంచికను జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,వయోవృద్ధులను గౌరవించడం,వారి భద్రతకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు.వయోవృద్ధుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,చట్టపరమైన హక్కులు,అందుబాటులో ఉన్న సేవలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.హక్కులపై అవగాహన కలిగి ఉన్నప్పుడే వయోవృద్ధులు ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా సద్వినియోగం చేసుకోగలరని తెలిపారు.వయోవృద్ధ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం, వేధింపులకు గురిచేయడం వంటి చర్యలను సహించబోమని ఎస్పీ స్పష్టం చేశారు. వయోవృద్ధులపై నిర్లక్ష్యానికి పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.వారి రక్షణ,సంక్షేమానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.వయోవృద్ధుల హక్కులు,రక్షణ,సంక్షేమ పథకాలు, అందుబాటులో ఉన్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో రూపొందించిన సమాచార సంచికలను జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో అందుబాటులో ఉంచుతున్నట్లు ఎస్పీ తెలిపారు.అవసరమైన సమయంలో వయోవృద్ధులు పోలీసులను సంప్రదించి సహాయం పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి డి.సునంద,గద్వాల సీఐ టంగుటూరి శ్రీను,జిల్లా బాలల సంరక్షణ అధికారి (డి సి పి ఓ) బి.నర్సింహులు,మహిళా,శిశు సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

ఆలంపూర్ సెప్టెంబర్ 26

(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)



జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ మున్సిపాలిటీ కేంద్రంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అలంపూర్ ఎమ్మెల్యే విజయుడుకి రజక సంఘం సభ్యులు ఘన స్వాగతం పలికారు అనంతరం ఎమ్మెల్యే విజయుడు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూజా కార్యక్రమం నిర్వహించి, పూలమాల వేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ పోరాటంలో విశేషమైన కృషి చేసి, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచారని అన్నారు. ఆమె పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఎంతో ఆదర్శప్రాయమని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు, అలంపూర్ మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భూ వివాదాలకు రీ-సర్వేతో పరిష్కారం

## - కేశంపేటలో 'భూ భారతి' భూ సర్వే పై అవగాహన సదస్సు

రేవల్లి, సెప్టెంబరు 26 (ప్రజాజ్యోతి):

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చేపట్టిన 'భూ భారతిభూ సర్వే'పై కేశంపేట గ్రామంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ సరస్వతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ బాదేపల్లి రేవతి సురేష్‌గౌడ్, సర్వేయర్ జీపీవో శేషయ్య పాల్గొన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టనున్న రీ-సర్వే ద్వారా భూముల హద్దులు స్పష్టమై, భూ వివాదాల పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని అధికారులు తెలిపారు. రైతులు సర్వే సిబ్బందికి సహకరించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.



# తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చాకల ఐలమ్మ జయంతి వేడుకలు!

ఆలంపూర్ సెప్టెంబర్ 26(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)

అయిజ మున్సిపల్ కార్యాలయంలో వీరనారి చాకల ఐలమ్మ జయంతి చైర్మన్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్ బిఆర్.ఎస్ పార్టీ అయిజ పట్టణ అధ్యక్షులు మాస్టర్ మధుకుమార్ కౌన్సిలర్లు మరియు ప్రముకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారుఈ సందర్భంగా మాట్లాడుతూ భూమి కోసం, భుక్తికోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన సాయుధ పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ పోరాటపటిమ చిరస్మరణీయమని నేడు మహిళామణులకు ఆదర్శ మూర్తి వారి ఆశయాలు కొనసాగిద్దాం అనితెలంగాణ ఆడబిడ్డలకు ఆదర్శ మహాయోధురాలైన ఐలమ్మ "భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం నాడు రజాకార్లు, దొరల అణచివేతకు వ్యతిరేకంగా ఎరునెక్కి పోరాడిన ఆ ధీర వనిత స్ఫూర్తి మనందరికీ ఎప్పటికీ మార్గదర్శకం. వారు అన్నారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు లిరజాక్ , డా.. కృష్ణ , మద్దిలేటి, కో ఆప్షన్ సభ్యులు నాగన్న గౌడ్ , మౌలా, ప్రజా సంఘాల నాయకులు ఎమ్మార్పీ.ఎస్ సీనియర్ నాయకులు అంజనేయులు , 7 వ వార్డు ఇంచార్జ్ అశ్వ పెద్దయ్య , చాకలి ఆంజనేయులు,చాకలి అంజి స్నేహ , చాకలి మధు , పూసల వెంకటేష్ , అంజిబాబు , సలీం ,వాల్మీకి నాగరాజు , రజక నరేష్ , మాదన్న , మైబు ,మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు ..



# ప్రపంచ హృదయ దినోత్సవానికి ముఖ్య అతిథిగా కలెక్టర్‌ను ఆహ్వానించిన వడ్డేపల్లి శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ, కౌన్సిలర్ డాక్టర్ విజయభాస్కర్





**ఆలంపూర్ సెప్టెంబర్ 26(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు జమ్మలమడుగులో ఈ నెల 29న ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక పాఠశాలలో డాక్టర్ విజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఏఐ స్టెతస్కోప్ హార్ట్ చెకప్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ని , మాజీ జడ్పీటీసీ వడ్డేపల్లి శ్రీనివాసులు , మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ఉపయోగించనున్న ఏఐ స్టెతస్కోప్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. హృదయ సంబంధిత ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం గురించి 7వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ విజయ్ భాస్కర్ కలెక్టర్‌కు వివరించారు. అదేవిధంగా వడ్డేపల్లి మున్సిపాలిటీకి అసిస్టెంట్ ఇంజనీర్ ను నియమించాలని కోరుతూ కలెక్టర్ కి రిక్వెస్ట్ లెటర్ అందజేశారు. మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల పనులు వేగవంతంగా చేపట్టేందుకు ఏఈ నియామకం అవసరమని వారు వివరించారు. ఈ వినతిపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, త్వరలో వడ్డేపల్లి మున్సిపాలిటీకి ఏఈని నియమించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ విజయభాస్కర్, 10వ వార్డు కౌన్సిలర్ తిమ్మప్ప, నాగరాజు, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**ఇటిక్యాల,ఎర్రవల్లి ప్రజా జ్యోతి సెప్టెంబర్ 26:**

జోగులాంబ గద్వాల జిల్లా బీచుపల్లి 10వ బెటాలియన్ లో వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఇన్‌చార్జి కమాండెంట్ బి.ఆదినారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెటాలియన్ కమాండెంట్ హాజరై, చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇన్‌చార్జి కమాండెంట్ బి.ఆదినారాయణ మాట్లాడుతూ,తెలంగాణ సాయుధ పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, ఆత్మగౌరవం సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటంస్ఫూర్తిదాయకమని అన్నారు. ఆమె త్యాగాలు ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. సిబ్బంది తమ విధులను అంకితభావంతో, క్రమశిక్షణతో,నిబద్ధతతో నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. సమాజ సంక్షేమం ప్రజా భద్రత మరియు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతనుసమర్ధవంతంగా నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు అసిస్టెంట్ కమాండెంట్ పార్థసారథి రెడ్డి,శ్రీనివాస్ ఇన్స్పెక్టర్ రాజేశం,శ్రీనివాస్ రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు లక్ష్మణ్,నిరంజన్ రెడ్డి, భార్గవరెడ్డి,తిరుపతి ఇతర అధికారులు సిబ్బంది పాల్గొని వీరనారి చాకలి ఐలమ్మ కి ఘనంగా నివాళులర్పించారు.






## చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఘన నివాళులు

**ఆలంపూర్ సెప్టెంబర్ 26(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

వడ్డేపల్లి మున్సిపాలిటీ పట్టణంలో చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగాచాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ , మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మంజుల ధర్మ మాట్లాడుతూభూమి, భుక్తి, ఆత్మగౌరవం కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం మహిళా శక్తికి, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఆమె త్యాగాలు, సేవలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా. రజాకారులు, భూస్వాముల దౌర్జన్యాలను ఎదురించి, అణగారిన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొన్నప్పటికీ ఆమె వెనుకడుగు వేయకుండా ధైర్యంగా పోరాడారని తెలిపారు. అలాగేచాకలి ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, నంభీ జయశ్రీ విజయ భాస్కర్ రజక సంఘం సభ్యులు ప్రతినిధులు, నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు.





# నారమ్మ మృతదేహానికి ఎర్రజెండా కప్పి నివాళులర్పించిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

వీపనగండ్ల (ప్రజా జ్యోతి)

మండల కేంద్రానికి చెందిన యుటిఎఫ్ జె వి వి రాష్ట్ర నేతలు రవి ప్రసాద్ గౌడ్, జితేందర్ గౌడ్, రాంబాబు గౌడ్ మాతృమూర్తి నారమ్మ శుక్రవారం రోజు మృతి చెందగా ఆమె మృతదేహానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ ఎర్రజెండా కప్పి శనివారం రోజు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో సీపీఎం పార్టీ కార్యకర్తలు,నాయకులు తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటూ దినదిన గండంగా జీవించిన విషమ పరిస్థితుల్లోనూ నారమ్మ కుటుంబం పార్టీకి అండగా నిలిచిందని నాయకులు గుర్తుచేశారు. నారమ్మ కుమారుల ఇల్లు గ్రామంలో సీపీఎం పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఒక కేంద్ర బిందువుగా నిలిచిందని తెలిపారు. ఆనాటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రాణత్యాగాలకు సైతం సిద్ధపడి, గ్రామంలో ఎర్రజెండాను, కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిలబెట్టడంలో నారమ్మ కుటుంబం కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు,నాయకులను నారమ్మ తన సొంత బిడ్డలుగా భావించి ఆప్యాయంగా ఆదరించారని నాయకులు స్మరించుకున్నారు. పార్టీ కోసం నారమ్మ ,ఆమె కుటుంబం అందించిన సేవలు,చేసిన త్యాగాలు సీపీఎం శ్రేణులకు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తాయని నాయకులు అన్నారు. ఆమె మృతి పార్టీకి,కుటుంబ సభ్యులకు తీరని లోటని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమనికి సీపీఎం రాష్ట్ర నేతలు వెంకట్రాములు,కిల్లె గోపాల్,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జబ్బార్, డి.బాల్ రెడ్డి పార్టీ కార్యకర్తలు మేకల ఆంజనేయులు, సి.హెచ్ వెంకటయ్య,ఆశన్న,ఈశ్వర్, ఎల్ఐసి వెంకటస్వామి,ఖాజా, నిరంజన్,ఆది, మిద్దె శ్రీను,రామకృష్ణ,సూర్యవంశం రాము, నవీన్, పార్టీ కార్యకర్తలు నివాళులర్పిస్తూ సంతాపం వ్యక్తం చేశారు



# శనేశ్వర స్వామికి అభిషేక పూజలు - పరమశివునికి రుద్రాభిషేకాలు

నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి)



శ్రీ పరాభవనామ సంవత్సరం భాద్రపద మాస శుక్ల పక్షం పౌర్ణమి శనివారం ఉత్తరాభాద్ర పూర్వా భద్ర నక్షత్రము నాడు బీజినేపల్లి మండలం పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామం ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ ఈ మాసంలో స్వామివారిని కొలిచినచో సంతృప్తి పొంది విశేష ఫలితాన్ని ఇస్తారని ప్రతిఒక్కరు జన్మరిత్యా,గోచార రీత్యా శనిగ్రహదోష నివారణకు స్వామివారిని శక్తిమేరకు పూజించాలని అన్నారు. ఆలయంలో గోన బుద్ధారెడ్డి కాలంనాటి బ్రహ్మసూత్రం గల పరమశివునికి భక్తులచే రుద్రాభిషేక పూజలు, అర్చనలు,దీపారాధన,నందీశ్వర స్వామికి ప్రత్యేక అర్చన నిర్వహించిన అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం,ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్ రావు,సర్పంచ్, సుగుణమ్మ,సభ్యులు కెంచె రాజేష్,ప్రభాకరాచారి,పుల్లయ్య,అడ్వకేట్ వీర శేఖరాచారి,శ్రీకాంత్ రెడ్డి, ఆర్చకులు శాంతి కుమార్,ఉమమహేశ్వర్,సిబ్బంది గోపాల్ రెడ్డి భక్తులు,మహిళలు పాల్గొన్నారు.

# మానసిక దృఢత్వానికి క్రీడలు దోహదపాడుతాయి

## - జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్

నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి)

రాష్ట్ర పోలీస్ అకాడమీలో సెప్టెంబర్ 28 నుండి 30 వరకు క్లస్టర్ సి భాగంలో జరిగే రాష్ట్ర స్థాయిబ్యాడ్మింటన్,లాన్ టెన్నిస్ క్రీడా పోటీలకు నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ శాఖ తరఫున ఎంపికైన పోలీస్ సిబ్బందికి శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్ క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు,సిబ్బంది విధి నిర్వహణ ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి,శారీరక,మానసిక దృఢత్వానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతి కనబరిచి జిల్లా పోలీస్ శాఖకు విజయాన్ని,మంచి పేరు ప్రఖ్యాతులు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు,ఎంపికైన క్రీడాకారులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# చాకలి ఐలమ్మకు పోరాటాలు తరతరాలకు స్ఫూర్తిదాయకం

## - జిల్లా ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జి పాటిల్

నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి)

వీరనారి చాకలి ఐలమ్మ పోరాటాలు తరతరాలకు స్ఫూర్తిదాయాకమని జిల్లాఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ పాటిల్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో తెలంగాణ రైతాంగ పోరాట యోధురాలు వీర వనిత చాకలి ఐలమ్మ 131వ,జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి డా.సంగ్రామ్ పాటిల్ చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు, అన్యాయంపై ఆమె సాగించిన పోరాటం తరతరాలకు స్ఫూర్తిదాయకమని,ఈ భూమినాది,పండించిన పంటనాది, తీసుకెళ్లడానికి దొరెవ్వడు,అంటూ మాటల్ని తూటాలుగా మల్చుకొని దొరల గుండెల్లో బడబాగ్నిలా రగిలిన తెలంగాణ రెతాంగ విప్లవాగ్ని చాకలి అయిలమ్మ అని అన్నారు. భూమికి,భుక్తికి,వెట్టిచాకిరీ విముక్తి కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు,పోలీస్ కార్యాలయ ఏవో కృష్ణయ్య,ఆర్ఐ జగన్,ఎస్ఐలురమేష్,వెంకటేశ్వర్లు,ఆర్.ఎస్.ఐ లు ప్రశాంత్,గౌస్ పాషా,శివాజీతో జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను సన్మానించిన

## నాగర్ కర్నూల్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పద్మ యాదవ్. ఉపాధ్యక్షురాలు మేడిపల్లి కల్పనా రెడ్డి





**వీపనగండ్ల, ప్రజా జ్యోతి రిపోర్టర్.**

మండల కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు పద్మ యాదవ్, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు మేడిపల్లి కల్పనా రెడ్డి శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పద్మ యాదవ్ మాట్లాడుతూ,,, కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం, చిన్నారులకు విద్యాబోధనకు అవసరమైన సామగ్రి తదితరాలను అందిస్తోందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వీపనగండ్ల, చిన్నంబావి, కోడేరు, వివిధ మండలాలు, గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు, సుగుణ భాయ్, సువర్ణ, మహేశ్వరి, ఆశా కార్యకర్తలను సన్మానిస్తున్నట్లు తెలిపారు.బీజేపీ మండల అధ్యక్షులు మరియు మండల మహిళా మోర్చా అధ్యక్షురాళ్ల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో ఈ సన్మాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు  మాట్లాడుతూ,,, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవిస్తూ దేశ సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.భారతదేశాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత ఆయనపై ఉందని పేర్కొంటూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలోవనపర్తి జిల్లా జిల్లా కౌన్సిల్ మెంబర్ నరేష్, మండల బిజెపి అధ్యక్షుడు ఆవుల నారాయణ, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు లత, మండల మహిళా మోర్చా జనరల్ సెక్రెటరీ ఆవుల లావణ్య, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# టాలెంట్ టెస్ట్‌లో బిందుకు ద్వితీయ బహుమతి

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్ :**



మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో శనివారం ఎన్ఆర్ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు.మండలంలోని ప్రాథమిక పాఠశాలలకు చెందిన ఐదో తరగతి విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నారు.ఈ టాలెంట్ టెస్ట్‌లో ఎంపీపీ ఎస్ తూముకుంట పాఠశాలకు చెందిన విద్యార్థిని హెచ్. బిందు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానంలో నిలిచి రెండో బహుమతి సాధించింది.ఈ సందర్భంగా మండల విద్యాధికారి నరసింహ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించడం ద్వారా పరీక్షలపై ఉన్న భయం తొలగిపోవడంతో పాటు, వారిలో దాగి ఉన్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించేలా ఉపాధ్యాయులు పర్యవేక్షణలో తీర్చిదిద్దాలని సూచించారు.అనంతరం టాలెంట్ టెస్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మోడల్, ప్రశంసా పత్రాలు,నగదు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎం భానుప్రకాష్, తూముకుంట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు,ఉపాధ్యాయులు ఆనంద్‌రెడ్డి, రాధాకృష్ణ, కృష్ణయ్య, స్వామి, క్రాంతి, రాధిక, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

# హరిజనవాడ విద్యార్థుల సత్తా..

## ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం

**వనపర్తి, సెప్టెంబరు 26 (ప్రజాజ్యోతి):**

పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ హరిజనవాడ పాఠశాలలో పాలమూరు ఎన్నారై ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించారు. 6వ తరగతిలో హనోక్ ప్రథమ, వర్షిని ద్వితీయ, క్రిష్ తృతీయ స్థానాలు సాధించారు. 7వ తరగతిలో సుహాని, లక్ష్మీదీపక్, శ్రీ విఘ్నేష్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 8వ తరగతిలో అబ్దుల్ రెహమాన్, మైథిలి, కిరణ్.. 9వ తరగతిలో ఆలియా తబస్సు, ప్రణవ్, వీ. శివకుమార్.. 10వ తరగతిలో జయలక్ష్మి, మనోజ్, సింధు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి మండల స్థాయి ప్రతిభా పోటీలకు ఎంపికైన విద్యార్థులను కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వనపర్తి జిల్లా ఏజీఎం గణేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, సీనియర్ ఉపాధ్యాయుడు వాకిట రవికుమార్, ఉపాధ్యాయ బృందం గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్, మెమెంటోలతో సత్కరించారు. మండల స్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.



# ప్రపంచ ప్రర్యాటక దినోత్సవం 2026

## నిలువురాళ్ళ చరిత్ర, ప్రాముఖ్యత

**కృష్ణా సెప్టెంబర్ 25 (ప్రజా జ్యోతి)**

మన వారసత్వ సంపదను కాపాడుకుందాం జిల్లా కలెక్టర్ శ్రీమతి సిహెచ్ ప్రియాంక గారు ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని ఈరోజు నారాయణపేట జిల్లాలోని ముడుమాల్ గ్రామంలో గల 3500 సంవత్సరాల పురాతన మైన నిలువురాళ్ల దగ్గర వాటిని అంతర్జాతీయంగా గుర్తింపు తీసుకురావాలని ఉద్దేశంతో గౌరవ జిల్లా కలెక్టర్ నేడు ముడుమాలలో నిలువురాళ్ల దగ్గర నారాయణపేట జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం ను నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ గారు పర్యాటక రంగం గురించి వివరిస్తూ పర్యాటక ద్వారా మన వారసత్వ సంపదలను కాపాడుకోవాలని 3500 సంవత్సరాలుగా ఎంతో ప్రాచుర్యం గల ఖగోళపరంగా విలువైన నిలువురాళ్లు ముడుమాలలో ఉండడం మన అందరి అదృష్టమని గర్వంగా చెప్పుకోవాలని పేర్కొన్నారు ఇంత మారుమూల ప్రాంతంలో ఇన్ని వేల సంవత్సరాలుగా చెక్కుచెదరకుండా ఉంచిన పరిసర ప్రాంత ప్రజలను అభినందించారు అందరం కూడా ఈ వారసత్వ సంపదను కాపాడుకుందామని పిలుపునిచ్చారు డెక్క హెరిటేజ్ సంస్థకు చెందిన ప్రొఫెసర్ ప్రవీణ్ గారు నిలువురాల యొక్క చరిత్రను వివరించారు నారాయణపేట జిల్లా విద్యాధికారి డాక్టర్ గోవిందరాజులు మాట్లాడుతూ జిల్లాలోని ఉపాధ్యాయులు విద్యార్థులు సందర్శించే విధంగా విద్యాశాఖ నుండి ప్రణాళిక చేస్తామని తెలియజేశారు ఈ సందర్భంగా యంగ్ టూరిజం క్లబ్ ల నుండి జరిపిన సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న విద్యార్థుల నుండి మొదటి మూడు స్థానాలలో నిలబడిన వారికి సర్టిఫికెట్లను మెమొంటోలను అందించారు ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముడుమాల ధన్వాడ దామరగిద్ద మీర్జాపూర్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు నిర్వహించబడిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ రషీద్ యంగ్ టూరిజం క్లబ్ నూడల్ ఆఫీసర్ గోవర్ధన్ గౌడ్ , కృష్ణా మండల తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కిషోర్ కుమార్ ఎంఈఓ నిజముద్దీన్ మద్దూర్ ఎంఈఓ జనార్దన్ రెడ్డి జిహెచ్ఎంలు వెంకటయ్య ప్రదీప్ కుమార్ పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు వై జనార్దన్ రెడ్డి మండల అధ్యక్షులు శేఖర్ ముడుమాల మురారి దొడ్డి గ్రామాల సర్పంచులు ఉపసర్పంచ్లు,పంచాయితీ సెక్రటరీ,వార్డ్ సభ్యులు, జిపిఓ లు, గ్రామస్తులు ,ప్రజాప్రతినిధులు పర్యాటకశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు




# హౌసింగ్‌బోర్డులో నాగుపాము కలకలం

**వనపర్తి, సెప్టెంబరు 26 (ప్రజాజ్యోతి):**



పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో నాగుపాము కలకలం రేపింది. చిన్న ఆంజనేయులు నివాసంలో శనివారం నాగుపాము సంచరిస్తుండటాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. దీంతో వారాల రఘుకు సమాచారం అందించగా.. ఆయన స్నేక్ క్యాచర్ గుండెల శివకు విషయం తెలిపారు. వెంటనే అక్కడికి చేరుకున్న శివ చాకచక్యంగా నాగుపామును పట్టుకుని బంధించారు. దీంతో కుటుంబ సభ్యులతో పాటు చుట్టుపక్కల వారు ఊపిరిపీల్చుకున్నారు. సకాలంలో స్పందించి పామును పట్టుకున్న శివను స్థానికులు అభినందించారు. విషసర్పాలు కనిపించినప్పుడు వాటిని చంపకుండా తనకు సమాచారం అందించాలని, సురక్షితంగా పట్టుకుని దూరప్రాంతంలో వదిలేస్తానని శివ తెలిపారు.

# విద్యార్థుల విద్య ప్రగతికి తల్లిదండ్రులు కూడా కృషి చేయాలి

### బోరెల్లి శేఖర్ ఆర్థిక సహకారంతో విద్యార్థులకు టై, బెల్ట్ వితరణ

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.**

మండల పరిధిలోని తూముకుంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం పేరెంట్స్ సమావేశం ప్రధానోపాధ్యాయులు కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.గ్రామ సర్పంచ్ శ్రీ పలుస రామన్ గౌడ్ ,పాఠశాల హెచ్ఎం కిరణ్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి అంటే ఉపాధ్యాయులదే బాధ్యత కాదని విద్యార్థుల తల్లిదండ్రులు కూడా బాధ్యతగా కృషి చేయాలని అన్నారు. విద్యార్థులను క్రమం తప్పకుండ పాఠశాలకు పంపాలని, ఇంటి దగ్గర విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టేలా చూడాలని అన్నారు.ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్య, అన్ని రకాల వసతులతో అందిస్తుందని,ప్రభుత్వ బడుల బలోపేతానికి అందరు కృషి అవసమని అన్నారు.అనంతరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామ యువకుడు బోరెల్లి శేఖర్ ఆర్థిక సహకారంతో సమాకూర్చిన విద్యార్థుల టై బెల్ట్ లను గ్రామ సర్పంచ్ శ్రీ పలుస రామన్ గౌడ్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాంబాబు, ఉపాధ్యాయులు క్రాంతి మురళీ, హై స్కూల్ ఉపాధ్యాయులు మోహన్ వెంకటస్వామి అంగన్వాడీ టీచర్స్ పారిజాత, లక్ష్మి, మాధవి, విద్యార్థుల తల్లి దండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# బీరం లక్ష్మారెడ్డికి వాకిటి శ్రీధర్ నివాళి

**వనపర్తి, సెప్టెంబరు 16 (ప్రజాజ్యోతి):**



మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తండ్రి, మాజీ సర్పంచ్, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు బీరం లక్ష్మారెడ్డి దశదినకర్మ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, రంగాపూర్ సర్పంచ్ హేమలతా కృష్ణారెడ్డి నివాళులర్పించారు. లక్ష్మారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం హర్షవర్ధన్‌రెడ్డి తల్లి బుచ్చమ్మను పరామర్శించారు. ఈ సందర్భంగా వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ లక్ష్మారెడ్డి కుటుంబంతో తనకు వ్యక్తిగత సాన్నిహిత్యం ఉందన్నారు. లక్ష్మారెడ్డి సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడంతో పాటు కొల్లాపూర్ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన మృతి వ్యక్తిగతంగా తమకు తీరని లోటని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రంగాపురం కృష్ణారెడ్డి, సురేందర్‌రెడ్డి, కోడేరు రఘు, బాల్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ గా కోరే రేణయ్య

## - నియామక పత్రం అందజేసిన ఎమ్మెల్యే

## డా వంశీ కృష్ణకి ధన్యవాదాలు తెలిపిన రేణయ్య

**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 26 (ప్రజాజ్యోతి బ్యూరో)**

అమ్రాబాద్ మండలం మాచారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోరే రేణయ్య ని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ గా శనివారం నియామక పత్రం అందజేయడం జరిగింది ఈ సందర్భంగా రేణయ్య మాట్లాడుతూ గత 24 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు విలువలకు కట్టుబడి 2005 సంవత్సరంలో మహబూబ్ నగర్ ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులుగా ఎన్నికై విద్యారంగ సమస్యలపై అనేక పోరాటాలు చేశారు 2010 సంవత్సరంలో అచ్చంపేట ఎన్ ఎస్ యు ఐ తాలూకా అధ్యక్షులుగా ఎన్నికై అచ్చంపేట





నియోజకవర్గం లో ఎన్ ఎస్ యు ఐ బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారుకాంగ్రెస్ పార్టీకి రేణయ్య సేవలను గుర్తించి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా నియమించారు అమ్రాబాద్ మండలంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం రేణయ్య పైన ఎన్ని అక్రమ కేసులు పెట్టిన ఎన్ని ఇబ్బందులకు గురిచేసిన కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి అచ్చంపేట గౌరవ శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ సార్ గెలుపు కొరకు నిరంతరం శ్రమించారు నా మీద నమ్మకంతో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ లో మెంబెర్ గా అవకాశం కల్పించిన అచ్చంపేట గౌరవ శాసనసభ్యులు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ వంశీకృష్ణ సార్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఎంపీ మల్లు రవి కి సిబిఎం ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ అనురాధమ్మకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి రేణయ్య ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు

# నర్వలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

**నర్వా సెప్టెంబర్ 26 ప్రజా జ్యోతి**

సాయిధ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ జయంతిని శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలో మండల రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు, ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు, ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, ఆయా పార్టీల నాయకులు దండు అయ్యప్ప, శరణప్ప, అజిత సింహ రెడ్డి, బోలుబండ సంజన, ఉందే కోడు గ్రామ సర్పంచ్ జగన్నాథ్, రజక సంఘం నాయకు లు బుజ్జన్న, బాబు, లక్ష్మణ అంజి, డ్రైవర్ బుచ్చానా తదితరులు పాల్గొన్నారు



# అంగన్ మిలాన్‌తో సేవా సంకల్పం

## - అంగన్‌వాడీ టీచర్లకు బీజేపీ నాయకుల సన్మానం

**చిన్నంబావి, సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి)**

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణలో సేవలందిస్తున్న టీచర్లను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. చిన్నంబావి మండలంలోని పెద్దమారూర్ గ్రామంలో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో 'సేవా సంకల్ప్ అభియాన్అంగన్ మిలాన్'కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య ఆధ్వర్యంలో, కొల్లాపూర్ బీజేపీ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు ఆదేశాల మేరకు కార్యక్రమం జరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పద్మ యాదవ్, మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు కల్పనా రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై అంగన్‌వాడీ కేంద్రంలో అందుతున్న సేవలను పరిశీలించారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతోపాటు గర్భిణులు,బాలింతల ఆరోగ్య పరిరక్షణలో టీచర్లు చేస్తున్న సేవలను అభినందించారు.ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు బి.గోవిందమ్మ, అరుణ, స్వాతి, లక్ష్మీదేవమ్మలను బీజేపీ నాయకులు సన్మానించారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా 'అంగన్ మిలాన్' చేపట్టినట్లు నాయకులు తెలిపారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు వివిధ సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పద్మ యాదవ్, మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు కల్పనా రెడ్డి, చిన్నంబావి బిజెపి మండల అధ్యక్షుడు బొగ్గు కురుమయ్య, గణేష్‌రెడ్డి, గోపాల్‌యాదవ్, వెంకటన్న, దాసరి నారాయణతోపాటు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.







# ఓపెన్ డిగ్రీ ప్రవేశాలకు ఈ నెల 30 చివరి తేదీ

## -కళాశాల ప్రిన్సిపల్ మధుమోహన్

**నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి)**

నాగర్ కర్నూల్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సార్వత్రిక అధ్యయన కేంద్రం ద్వారా డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 30వ,తేదీ వరకు అవకాశం ఉందని కళాశాల ప్రిన్సిపల్ మదన్ మోహన్,కేంద్రం సమన్వయకర్త అంజయ్య తెలిపారు.శనివారం కళాశాల ఆవరణలో అడ్మిషన్లకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.ఇంటర్మీడియట్,ఐటీఐ లేదా ఏదైనా రెండేళ్ల డిప్లొమా కోర్సు పూర్తి చేసిన వారు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ లో చేరేందుకు అర్హులని వారు తెలిపారు.ఉద్యోగాలు,ఇతర కారణాలతో చదువును కొనసాగించలేకపోయిన వారు,గృహిణులు,యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని,డిగ్రీలో ప్రవేశం పొందేందుకు ఆసక్తి ఉన్న వారు నాగర్ కర్నూల్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలోని అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలని అడ్మిషన్ల పూర్తి వివరాలకు 7382929779 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

# ప్రతి విద్యార్థి అభ్యసనానికి అనుగుణంగా ఏఐ బోధన

### - 120 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో కృత్రిమ మేధస్సుతో విద్యాబోధన

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 26 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు కృత్రిమ మేధస్సు ఆధారిత అనుకూల అభ్యసన బోధనా విధానాన్ని ఉపాధ్యాయులు సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా సహాయ పర్యవేక్షణ అధికారి (ఏఎంఓ) దుంకుడు శ్రీనివాస్ సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్) కళాశాలలో శనివారం ఉపాధ్యాయులకు ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం (ఎఫ్‌ఎల్‌ఎన్)లో భాగంగా ఏఐ ఆధారిత అనుకూల అభ్యసన విధానంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నమోదు ప్రక్రియ, పరిపాలనా అంతర్జాల వేదిక వినియోగంతో పాటు సహాయక భాషా అభ్యసనం, సహాయక గణిత అభ్యసనం ద్వారా 3 నుంచి 5వ తరగతి విద్యార్థుల్లో భాషా, గణిత నైపుణ్యాలను పెంపొందించే విధానాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కృత్రిమ మేధస్సు సాంకేతికతను సద్వినియోగం చేసుకుని విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచాలని, ప్రతి విద్యార్థి ఈ కార్యక్రమంలో చురుకుగా భాగస్వామ్యమయ్యేలా పాఠశాల స్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ఒకే పాఠం అందరికీ కాదు.. ప్రతి విద్యార్థి నేర్చుకునే విధానానికి అనుగుణంగా బోధన మారాలి అని ముఖ్య అతిథి దుంకుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఇప్పటికే 120 ప్రాథమిక పాఠశాలల్లో కృత్రిమ మేధస్సు ఆధారిత బోధనా విధానం అమలవుతోందని తెలిపారు. జిల్లాను రాష్ట్రస్థాయిలో ముందంజలో నిలిపేందుకు ఉపాధ్యాయులందరూ సమన్వయంతో కృషి చేయాలని కోరారు. జిల్లా వనరుల నిపుణులు జి. రవి, ఎ. రాఘవేంద్ర, రవీందర్ రెడ్డి, రవి ప్రకాశ్, శ్వేత, వీరేశ్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కృత్రిమ మేధస్సు ఆధారిత అనుకూల అభ్యసన విధానం అమలు తీరును ఉపాధ్యాయులకు ఆచరణాత్మకంగా వివరించారు.



# వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళులు

### - సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయం: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 26 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**



అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం ధైర్యంగా పోరాడిన గొప్ప యోధురాలని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయమని, ఆమె ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ కలెక్టర్ (శిక్షణలో) సాయి శివాని, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జిల్లా రెవెన్యూ అధికారి ఏ. నిర్మల, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ

### - పద్మావతి కాలనీలో ఘనంగా జయంతి వేడుకలు.. నివాళులర్పించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా, మేయర్ గుమ్మల మమత

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 26 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం వీరోచితంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ త్యాగాలు, పోరాటాలు నేటి తరానికి ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ ముదిరాజ్, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి కొనియాడారు. మహబూబ్‌నగర్ జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పద్మావతి కాలనీలో శనివారం చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కలెక్టర్, మేయర్, డిప్యూటీ మేయర్ ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమానత్వం, సామాజిక న్యాయం సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఏ. సంజీవ్ ముదిరాజ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహా రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# గణేష్ నిమజ్జన బందోబస్తులో సమర్థవంతమైన సేవలు

**- తెలంగాణ ప్రత్యేక పోలీసు 10వ బెటాలియన్ సిబ్బందికి ఎస్పీ జానకి అభినందనలు**

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 26 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

గణేష్ నిమజ్జన కార్యక్రమం సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ కోసం సమర్థవంతంగా బందోబస్తు విధులు నిర్వహించిన తెలంగాణ ప్రత్యేక పోలీస్ 10వ బెటాలియన్, బీచ్‌పల్లి, జోగులాంబ గద్వాల జిల్లా సిబ్బందిని జిల్లా ఎస్పీ దరావత్ జానకి అభినందించారు. గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జరిగేందుకు బెటాలియన్ సిబ్బంది క్రమశిక్షణతో, సమన్వయంతో విధులు నిర్వర్తించారు. నిమజ్జన మార్గాలు, ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో అప్రమత్తంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా విధుల్లో ఉత్తమంగా సేవలందించిన సిబ్బందిని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని ఎస్పీ చాంబర్‌కు పిలిపించి వారి సేవలను ఎస్పీ అభినందించారు. విధి నిర్వహణలో ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజలకు మరింత మెరుగైన పోలీసు సేవలు అందించాలని సూచించారు.

**రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి**

ప్రతి ఒక్కరి ప్రాణం వారి కుటుంబానికి ఎంతో విలువైనదని ఎస్పీ డి. జానకి పేర్కొన్నారు. విధులు ముగించుకుని సురక్షితంగా ఇంటికి చేరుకోవడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని సూచించారు. “మన కోసం మన కుటుంబ సభ్యులు ఎదురుచూస్తుంటారు. అందుకే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతకు ప్రాధాన్యతనిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి” అని ఎస్పీ సూచించారు. గణేష్ నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, విజయవంతంగా ముగియడానికి సహకరించిన తెలంగాణ ప్రత్యేక పోలీస్ 10వ బెటాలియన్ సిబ్బందికి ఎస్పీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.



# వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

**- జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు.. నివాళులర్పించిన ఎస్పీ జానకి ఐపీఎస్**

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 26 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

అన్యాయం, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు, ఆత్మగౌరవం, సామాజిక చైతన్యం సమాజానికి స్ఫూర్తిదాయకమని జిల్లా ఎస్పీ దరావత్ జానకి అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా శనివారం మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ అన్యాయం, అణచివేతకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన మహనీయురాలని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు. ఆమె చూపిన పోరాట పటిమ, ధైర్యం, పట్టుదలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని, ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, ఏఓ రుక్మిణీ భాయ్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మోతిరామ్, ఆర్‌ఐలు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్, ఆర్ఎస్‌ఐలు, కార్యాలయ పర్యవేక్షకులు మధు, బాలరాజు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్యారసాని సురేష్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# అన్యాయానికి తలవంచని వీరనారి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం

**- పాలకొండలో ఐలమ్మ విగ్రహావిష్కరణలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్**

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 26 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**



భూస్వాములు, దొరల ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాడి పేదల హక్కుల కోసం నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ పురపాలక పరిధిలోని పాలకొండలో శనివారం నిర్వహించిన చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. పేదలకు భూములు దక్కాలని, వారు స్వయంగా వ్యవసాయం చేసుకుని గౌరవంగా జీవించాలని ఆకాంక్షిస్తూ ఐలమ్మ రోకలిబండను ఆయుధంగా చేసుకుని భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం సాగించారని గుర్తుచేశారు. సామాన్య రజక కుటుంబంలో జన్మించిన ఐలమ్మ చిన్నతనం నుంచే ఎన్నో కష్టాలను ఎదుర్కొని, అన్యాయానికి తలవంచకుండా తన హక్కుల కోసం పోరాడారని తెలిపారు. ఐలమ్మ ఒక వర్గం లేదా ఒక కులం కోసం మాత్రమే పోరాడలేదని, అన్ని వర్గాల ప్రజల హక్కుల కోసం పోరాడిన మహనీయురాలని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. మహనీయుల పోరాటాలను ఏదైనా ఒక కులానికి, వర్గానికి పరిమితం చేయకుండా వారి ఆశయాలను సమాజం మొత్తం స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు.నాటి భూస్వామ్య వ్యవస్థను ఎదిరించిన ఐలమ్మ ధిక్కార స్ఫూర్తితో పాటు, అప్పటి చట్టాల పరిధిలో న్యాయపరంగా పోరాడిన ప్రజాస్వామిక స్ఫూర్తి కూడా ఆదర్శనీయమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలకు ఆమె పోరాటం నూతన స్ఫూర్తిని, తెగువను అందించిందన్నారు. ఐలమ్మ స్ఫూర్తితో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు ఆమె గొప్పతనాన్ని తెలియజేసేలా కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహించే సంప్రదాయాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిందని ఆయన తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో చాకలి ఐలమ్మతో పాటు పలువురు మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు.పాలకొండ ప్రాంతాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేశామని పేర్కొన్న శ్రీనివాస్ గౌడ్, భవిష్యత్‌లో అధికారంలోకి వస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా పరిశ్రమలను తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని అన్నారు. అనంతరం పద్మావతి కాలనీలోని గ్రీన్‌బెల్ట్ వద్ద ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, కార్పొరేటర్లు సరస్వతి, సీనియర్ నాయకులు కుర్వ శ్రీశైలం, నరేందర్, క్రాంతి, శ్రీనివాస్ రెడ్డి, సురేందర్, ఆంజనేయులు, రవికిషన్ రెడ్డి, గిరిధర్ రెడ్డి, కోట్ల నర్సింహా, అహ్మదుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ ని ప్రధాని చేయడమే యువజన కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం యువజన కాంగ్రెస్ శ్రేణులు చురుగ్గా పని చేయాలాని పిలుపునిచ్చిన

మాచర్లలక్ష్మణ్ యూత్ కాంగ్రెస్ అసెంబ్లి వైస్ ప్రెసిడెంట్ గద్వాల

**ఆలంపూర్ సెప్టెంబర్ 26(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**




జోగులాంబ గద్వాల జిల్లా జిల్లా కేంద్రంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆర్ తిరుమలేష్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి యువజన కాంగ్రెస్ జోగులాంబ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ విష్ణువర్ధన్ రెడ్డి , వంగ భాస్కర్ గౌడ్ తో కలిసి యువజన కాంగ్రెస్ అసెంబ్లి వైస్ ప్రెసిడెంట్ మాచర్ల లక్ష్మణ్ హాజరై మాట్లాడారు ఈ సందర్భంగా మాచర్ల లక్ష్మణ్ మాట్లాడుతూ అధికారంలో ఉన్న సమయంలో పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీఆర్.ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వేల సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టి నియామకాలు కొనసాగిస్తోందని అన్నారు అదేవిధంగావచ్చే 2028సార్వత్రిక ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకుని ప్రతి నియోజకవర్గం, ప్రతి మండలం, ప్రతి గ్రామం వరకు యువజన కాంగ్రెస్ శ్రేణులు చేరుకోవాలని మాచర్ల లక్ష్మణ్ పిలుపునిచ్చారు.ఎన్నికల వరకు సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి యువజన కాంగ్రెస్ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ తప్పకుండా రెండో సారి కూడా అధికారంలోకి రాబోతున్నం కనుక మన ప్రభుత్వం ఇచ్చే ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే విధంగా యువజన కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని కోరారు అదేవిధంగా త్వరలో ఇచ్చేజోగులాంబ గద్వాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తరపున ఇచ్చే నామినేటెడ్ పదవులు విషయంలో కనీసం 30శాతం నామినేటెడ్ పదవులు యువజన కాంగ్రెస్ శ్రేణులకు ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులును, టి.పిసిసి అధ్యక్షులుని ఏఐసీసీ కార్యదర్శి మాజి ఎమ్మెల్యే, ఛత్తీస్ ఘడ్ రాష్ట్ర ఇన్చార్జి డాక్టర్ యస్ ఏ సంపత్ కుమార్ ని, షిప్ అండ్ గోట్స్ కార్పొరేషన్ చైర్మన్,గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి శ్రీమతి సరిత తిరుపతయ్య కి విజ్ఞప్తి చేశారుఈ కార్యక్రమంలో జోగులాంబ గద్వాల జిల్లా యువజన కాంగ్రెస్ ఇన్చార్జి విష్ణువర్ధన్ రెడ్డి , వంగ భాస్కర్ గౌడ్ , జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు ఆర్ తిరమలేష , గద్వాల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ మాచర్ల లక్ష్మణ్ , జోగులాంబ గద్వాల జిల్లా కార్యవర్గ సభ్యులు గద్వాల నియోజకవర్గము అలంపూర్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ నాయకులు అన్ని మండలాల అధ్యక్షులు యూత్ కాంగ్రెస్ నేతలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# బీరం హర్షవర్ధన్‌రెడ్డిని పరామర్శించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

**చిన్నంబావి, సెప్టెంబర్ 26 (ప్రజా జ్యోతి)**

కొల్లాపూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తండ్రి బీరం లక్ష్మారెడ్డి మృతిపట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, హర్షవర్ధన్‌రెడ్డికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. లక్ష్మారెడ్డి మృతి కుటుంబ సభ్యులు,బంధుమిత్రులకు తీరని లోటని పేర్కొని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు శీలం అగ్రసామి, వనపర్తి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు, సులిగిరి శ్రీనివాసులు,చిన్నంబావి మండల అధ్యక్షుడు గోపాల్, వీపనగండ్ల మండల అధ్యక్షుడు ప్రవీణ్, పానగల్ మండల ఎంఎస్‌ఎఫ్ నాయకుడు అజయ్ మాదిగ, పానగల్ మండల మాజీ అధ్యక్షుడు రామకృష్ణ, జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి దయ్యపు రవివర్మ, వేపనాల గ్రామ అధ్యక్షుడు గడ్డల లక్ష్మణ్, మండల కార్యదర్శి కోటేష్, ఎం.శివ, పగిడాల చిన్న కురుమయ్య, జట్టపోల్ సులిగిరి కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.




# రాహుల్ గాంధీ ని ప్రధాని చేయడమే యువజన కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం యువజన కాంగ్రెస్ శ్రేణులు చురుగ్గా పని చేయాలని పిలుపునిచ్చిన మాచర్లలక్ష్మణ్ యూత్ కాంగ్రెస్ అసెంబ్లి వైస్ ప్రెసిడెంట్ గద్వాల

**ఆలంపూర్ సెప్టెంబర్ 26(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**






జోగులాంబ గద్వాల జిల్లా జిల్లా కేంద్రంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆర్ తిరుమలేష్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి యువజన కాంగ్రెస్ జోగులాంబ గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ విష్ణువర్ధన్ రెడ్డి , వంగ భాస్కర్ గౌడ్ తో కలిసి యువజన కాంగ్రెస్ అసెంబ్లి వైస్ ప్రెసిడెంట్ మాచర్ల లక్ష్మణ్ హాజరై మాట్లాడారుఈ సందర్భంగా మాచర్ల లక్ష్మణ్ మాట్లాడుతూ అధికారంలో ఉన్న సమయంలో పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బీఆర్.ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వేల సంఖ్యలో ఉద్యోగాల భర్తీకి చర్యలు చేపట్టి నియామకాలు కొనసాగిస్తోందని అన్నారు అదేవిధంగావచ్చే 2028సార్వత్రిక ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకుని ప్రతి నియోజకవర్గం, ప్రతి మండలం, ప్రతి గ్రామం వరకు యువజన కాంగ్రెస్ శ్రేణులు చేరుకోవాలని మాచర్ల లక్ష్మణ్ పిలుపునిచ్చారు.ఎన్నికల వరకు సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి యువజన కాంగ్రెస్ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. అలాగేకాంగ్రెస్ పార్టీ తప్పకుండా రెండో సారి కూడా అధికారంలోకి రాబోతున్నం కనుక మన ప్రభుత్వం ఇచ్చే ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే విధంగా యువజన కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని కోరారు అదేవిధంగా త్వరలో ఇచ్చేజోగులాంబ గద్వాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తరపున ఇచ్చే నామినేటెడ్ పదవులు విషయంలో కనీసం 30శాతం నామినేటెడ్ పదవులు యువజన కాంగ్రెస్ శ్రేణులకు ఇవ్వాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులును, టి.పిసిసి అధ్యక్షులుని ఏఐసీసీ కార్యదర్శి మాజి ఎమ్మెల్యే, ఛత్తీస్ ఘడ్ రాష్ట్ర ఇన్చార్జి డాక్టర్ యస్ ఏ సంపత్ కుమార్ ని, షిప్ అండ్ గోట్స్ కార్పొరేషన్ చైర్మన్,గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి శ్రీమతి సరిత తిరుపతయ్య కి విజ్ఞప్తి చేశారుఈ కార్యక్రమంలో జోగులాంబ గద్వాల జిల్లా యువజన కాంగ్రెస్ ఇన్చార్జి విష్ణువర్ధన్ రెడ్డి , వంగ భాస్కర్ గౌడ్ , జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు ఆర్ తిరమలేష , గద్వాల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ మాచర్ల లక్ష్మణ్ , జోగులాంబ గద్వాల జిల్లా కార్యవర్గ సభ్యులు గద్వాల నియోజకవర్గము అలంపూర్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ నాయకులు అన్ని మండలాల అధ్యక్షులు యూత్ కాంగ్రెస్ నేతలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# జ్వారంలో ఘనంగా చాకలి ఐలమ్మ గారి 131 జయంతి వేడుకలు







ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన మాజీ ఎంపీపీ వై.సత్యా రెడ్డి,వై.రాజారెడి ,గ్రామ ఐలమ్మ రజక కమిటీ నాయకులు

**ఆలంపూర్ సెప్టెంబర్ 26(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం బిజ్వారం గ్రామంలో ఐలమ్మ రజక కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఐలమ్మ 131 జయంతి వేడుకలకు ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీపీలు వై.సత్యారెడ్డి,వై.రాజారెడ్డి హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి చాకలి ఐలమ్మ 131వ జయంతోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారుఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు వై.సత్యారెడ్డి,వై. రాజారెడ్డి,దళిత జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. తిరుమలేష్ మాట్లాడుతూ... భూమికోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణ ప్రజల తెగువను పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన నిప్పు కనిక చాకలి ఐలమ్మ అని అన్నారు. ప్రతి ఒక్కరు చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారిని శాలువతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ చాపకండ్ల కర్రెన్న,వార్డ్ మెంబర్ బి. హరిన్ కుమార్,గ్రామ ఐలమ్మ రజక కమిటీ సంఘం అధ్యక్షుడు సి. నర్సింహులు,ఉపాధ్యక్షుడు అమరేష్,సలహాదారుడు సిద్దు, బీసన్న,కృష్ణ,వీరేష్, వెంకట్రాములు,లక్ష్మన్న, మాజీ ఉపసర్పంచ్ వెంకటేష్,చిన్న ఆశన్న,మండల సింగిల్ విండో మాజీ డైరెక్టర్ రంగన్న,గ్రామ భీమేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గోపాల కృష్ణ,సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

# అయిజ పట్టణంలో వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా వేడుకలు

**ఆలంపూర్ సెప్టెంబర్ 26(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి)**

జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ కేంద్రంలో శనివారం ఉదయం భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర చాకలి ఐలమ్మ చిత్రపటానికి. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఆంజనేయులు  అధ్యక్షతన  పూలమాలతో ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ అగ్రకులాల స్త్రీలు, దొరసానులు తమను కూడా 'దొరా' అని ఉత్పత్తికులాల (బీసీ కులాల) చేత పిలుపించుకొనే సంస్కృతికి చరమగీతం పాడినవారిలో ఐలమ్మ ముందంజలో ఉన్నారు. దొరా అని పిలువకపోతే ఉన్నతకులాలతో పాటు వారి అనుంగు ఉంపుడు కత్తెలలో కూడా ఉన్న రాక్షస ప్రవృత్తి అనేక పీడన రూపాలలో బయటకు వచ్చేది. వెనుకబడిన కులాల మీద ఆ పీడన రూపాలు విరుచుకుపడేవి. తమను దొరా అని పిలువని ఉత్పత్తి కులాల స్త్రీల మీద తమ భర్తలను ఉసిగొల్పి, దగ్గరుండి ఆఘాయిత్యం చేయించేవారు. ఈ భూమినాది... పండించిన పంటనాది... తీసుకెళ్లడానికి దొరెవ్వడు... నా ప్రాణం పోయాకే ఈ పంట, భూమి మీరు దక్కించుకోగలరు.. అంటూ మాటల్ని తూటాలుగా మల్చుకొని దొరల గుండెల్లో బడబాగ్నిలా రగిలిన తెలంగాణ రెతాంగ విప్లవాగ్ని చాకలి ఐలమ్మ అని ఆమె వీర గాధను కొనియాడారు.ఈ కార్యక్రమంలో అయిజ మున్సిపాలిటీ చైర్మన్ సీఎం సురేష్  వార్డు కౌన్సిలర్లు, టి. ఆర్. పి నాయకుడు మొరుగు వీరేష్, టి.ఆర్.ఎస్వి నాయకుడు కురువపల్లయ్య , అయిజ పట్టణ బి.ఆర్.ఎస్ అధ్యక్షులు సాకలి మధు కుమార్, మరియు పట్టణ ప్రముఖులు కుల సంఘ నాయకులు ఎమ్మార్పీఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేశారు

